# ప్రేమతత్వం

రచన: ముత్యాల సత్యనారాయణ

మావాడికి అంటే అవతారానికి పేరుప్రతిష్ఠలు సంపాదించటానికి అవకాశాలు లేపోయినా ఆదర్శాలకి లోటులేదు. మనకు యిప్పుడు విషయం పెండ్లిళ్ళమీద. మా అవతారానికి పెండ్లిళ్ళమీద కాశీ మజిలీలన్ని ఆదర్శాలున్నాయ్. కల్యాణపు బొట్టుదగ్గర నుంచి కంకణాలు విప్పేవరకూ అన్నివిషయాలలోను మార్పు తేవాలంటాడు. అవతారం ఈ విషయాలు మాట్లాడుతున్నపుడు, ఉద్రేకము పొందుతూ తన ఉద్దేశాలను చెప్పుకపోతుంటాడు. మావాడిలో ఒక్క సుగుణం వుంది. అది సుగుణమే అనండి లేక దుర్గుణమే అనండి. వాడు మాట్లాడేటప్పుడు ఎదుటివాళ్ళు వింటున్నా వినకపోయినా ఏకధాటిగా అక్కడ ఏ వస్తువున్నా దానితో చెప్పేయగల ప్రజ్ఞవుంది. ఇటువంటి ప్రజ్ఞ గల మా అవతారం ఈ భావి భారతదేశములో ఏ మంత్రో లేక కనీసం ఏ ఎం. ఎల్. ఏనో అవ్వవలసినవాడు.

పెండ్లిళ్ళగురించి చెప్పుకపోతున్నాడు ఒకరోజున. దానికి శ్రోతలం నేను మా వెంకటక్రిష్ణాను. ఎవడైనా పెద్దమనిషివచ్చి "ఈ 20 వేల రూపాయిలు కట్నంతీసుకుని మా అమ్మాయిని వివాహం చేసుకో నాయనా" అంటే ఛీ! అని కాలదన్ని తను ప్రేమించిన యువతినే ఒక్క చిల్లిగవ్వ కట్నంలేకుండా ఏమీ ఆట్టహాసం లేకుండా వివాహం చేసుకుంటాడట! (20 వేల రూపాయలు కట్నం వచ్చే యోగ్యత వాడికుందిలెండి) పాశ్చాత్యులు చూడు ఒకరి నొకరు యువతీ యువకులు ఎన్నుకుని వివాహంచేసుకుంటారు కాని మనవాళ్ళలాగ తల్లి దండ్రులు పెండ్లిళ్ళు కుదర్చటం అనే అనాగరికపు పనిచేయరు. వాళ్ళ వివాహాలు కూడా ఏమీ తతంగం లేకుండా కాగితం కలం పూలమాలలు మార్చుకోవటం లేక ఉంగరాలు మార్చుకోవటంతో తేలికగా జరిగిపోతాయి. మనవాళ్ళు కట్నం కానుకలు ముద్దుముచ్చటలు అని పెండ్లికొడుకు లాంఛనాలు, ఆడబడుచు కట్నాలు అని తొంబై తొమ్మిది తతంగాలు జరిపి ఒక్క పెండ్లి చేయటానికే ఇల్లు గుల్లచేసుకుని, అప్పులపాలై ఉన్నదంతా తెగనమ్ముకుని వీధిలో పడతారు. అదంతా మారాలి. మనం మనముందువాళ్ళకు ఆదర్శంగా క్రియలలో ఈ పై విషయాలన్నింటిలోను విప్లవం తేవాలి" అంటూ ఏకధాటిగా గుక్కపెట్టి చెప్పుకపోతున్నవాడిని మా క్రిష్ణ ఆపి కొంటెగా "అయితే నువ్వు పై చెప్పిన ప్రకారం వివాహంచేసుకుని ఆదర్శ పురుషుడివి అవుతావన్న మాటేగా?" అన్నాడు.

"తప్పకుండా చూద్దువుగానిగా" అన్నాడు అవతారం.

"ప్రేమించి అంటున్నావు కదా అంటే ఏం చెయ్యటం, ఎట్లా ప్రేమించటం" అన్నాడు క్రిష్ణ.

"ఓసీ! అదేరా? ప్రేమంటే చూడు. నువ్వు ఏ అమ్మాయినన్నా చూస్తావనుకో, చూచినవెంటనే ఆ అమ్మాయి నాకు ప్రపంచంలో అన్నివిషయాల్లో చేదోడు వాదోడుగా వుంటే బాగుంటుంది అని నీ అంతరాత్మలో ఆ యువతిమీద ఒకవిధమైన అభిప్రాయం ఏర్పడుతుంది. అదే ప్రేమంటేను" అని ప్రేమనుగురించి సునాయాసంగా చెప్పేకాడు మళ్ళీ అన్నాడు. "ఒకొక్కడు ఒకొక్కవిషయంలో ఆ యువతికున్న ప్రత్యేకతలనుబట్టి ప్రేమించటం జరుగుతుంది. ప్రథమ చూపులోనే ప్రేమించటం అంటే చూడు నీవు సైన్సులో చదువుకునే వుంటావ్ 'అసంకల్పచర్య' అని. అంటే ఏ పామో లేక నీ కపకారంచేసే ఏ జంతువైనా నీకు సమీపానకొస్తే నీకళ్ళు ఆ జంతువుని చూడకపోయినా నీ శరీరం వెంటనే క్షణంలో నీకు తెలీకుండా ఆ జంతువుకు దూరంగా లాగివేయబడుతుంది. అలాగే ఏ అమ్మాయినన్నా చూస్తావనుకో! వెంటనే ఆ అమ్మాయిమీద నీకు ప్రేమ పుట్టుకొస్తుంది దానిని మనం 'అసంకల్పప్రేమ' అని పిలుద్దాం అని ఒక క్రొత్త పదాన్ని సాహిత్యంలో కానికిచ్చాడు. ఇంతలోనే వాళ్ళనాన్న అచ్చటకు రావటం తటస్థించింది. లేకపోతే ఈవిషయంఅనంతమే!

ఈవిషయం గడిచిన పదిరోజుల అనంతరం నేను మా అవతారంతో సినిమాకు వెళ్లటం తటస్థించింది. మేము ఆలస్యంగా వెళ్ళటం వల్ల సినిమా అప్పటికే ప్రారంభించారు. ఆ చీకట్లోనే పోయి మేమిద్దరం బాల్కనీలో చెరొహ కుర్చీలోను కూర్చున్నాం. సినీమా జరుగుతోంది. కొంచెంసేపు గడచిన తరువాత గాజులచప్పుడు మా ప్రక్కకుర్చీలో వినిపించగానే, ఎవరో స్త్రీ మాప్రక్కకుర్చీలో ఉన్నదని గ్రహించాం. అంటే మా అవతారానికి అవతల ప్రక్కకుర్చీలో. విశ్రాంతి సమయం వచ్చేలోపున ఆ అమ్మాయిచేయి మా పాడి కుర్చీమీద మావాడి చేతిమీద మూడు నాలుగుమార్లు వేయటం తటస్థించింది. విశ్రాంతిసమయం రానేవచ్చింది. చూసేటప్పటికి ఒకపదహారు ఏండ్ల యువతి నవీనఫక్కీలో అలంకరించుకున్నది మా అవతారం ప్రక్క కుర్చీలో కూర్చున్నది. ఆమె ప్రక్క ఎవ్వరూ లేకపోవుటచే ఒంటరిగానే వచ్చిందని అనుకున్నాం. ఆ యువతి అందగత్తె అని అంటానికి సందేహం లేదు. మా అవతారం ఆ అమ్మాయిని చూడగానే ఉబ్బితబ్బిబ్బులవటం నేను గ్రహించా. వాడికి ఆ అమ్మాయి అన్నివిధాలా చాలా బాగుందట. అంగీకరిస్తే తప్పక పెండ్లి చేసుకుతీర్తాడట కులగోత్రాలు మంచీ చెడూ తెలుసుకోకుండా వీడిట్లా పేల్తున్నాడేమా, పిచ్చిగాని పట్టలేదు కదా అనుకున్నా. ఏదో స్నేహితుడుగదా నచ్చచెప్పి వాడి మనస్సు మరల్చటం నావిధి అని భావించా. వాడి ఆదర్శాలు తెలిసిన నాకు ఆ విషయంలో నిరుత్సాహమే కలిగింది. "అట్లా బయటకు పోయివద్దాం రారా" అన్నా. కాని వాడు కదిలివస్తేకదా! నేను బయటకుపోయి తిరిగి వచ్చేటప్పటికి వాళ్ళిద్దరూ యిదివరలో పరిచయమున్నవాళ్ళలాగే మాట్లాడుకోవటం నాకు ఆశ్చర్యంవేసింది. పోనీ వీళ్ళకు పరిచయమున్నదా అంటే, నాకు పూర్తిగా తెలుసు వీడితో పరిచయమున్న అమ్మాయిలే లేరని.

సినిమా అయిపోయింది. నేను పట్టుబట్టి లాక్కురాగా ఆ అమ్మాయితో ఏదో చెప్పి సెలవుతీసుకుని రాలేక రాలేక నాతో ఎటో యింటికి వచ్చాడు. ఇంటిదగ్గిర చెప్పాడు ఆ అమ్మాయితో తనకు సినీమా హాల్లోనే వివాహం అయిపోయిందని. వీడి ప్రవర్తన వీడిమాటలు వింటూంటే వీడికి తప్పక పిచ్చెత్తి వుండాలనుకున్నా. నా వంక అదోరకంగా చూసి "నీవు నమ్మవనే అనుకున్నా. చూడు ఉంగరాలు కూడా మార్చుకున్నాం. చిరునామా కూడా యిచ్చింది. రేపు ప్రొద్దుట పోయి "రిజిష్టర్ మేరేజి చేసుకుంటాం" అని సగర్వంగా వాడివేలు చూపాడు. వాడి చేతినుండే చక్కటి రాళ్ళవుంగరం లేదు. దానిస్థానే ఒక సాదా ఉంగరంవుంది. దాన్ని ముద్దట్టుకుని నన్ను కౌగలించుకున్నాడు. వాణ్ణి వదలించుకోటానికి చచ్చినంత పనయింది. అప్పుడు వేలునున్న ఉంగరంతీసి పరిశీలిస్తును కదా, ఇంకేముంది వీడికి బాగా టోకరా వేసింది ఆజాణ. నూటికి నూరు పాళ్ళు గిల్టు ఉంగరం అది. తెల్లవారాక ఆ అమ్మాయి చిరునామాబట్టి చూస్తే ఎక్కడైనా దొంకితే కదా, పాపం మా అవతారం మొదటి పెండ్లి ఒక్క రాళ్లవుంగరంతో పూర్తిఅయింది. అందుకనే వాణ్ణి ఇప్పటికీ అందరూ రెండో పెండ్లివాడు అంటుంటారు.